తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యాపేట యాద్రాద్రి భువనగిరి
సోమవారం
26 అక్టోబర్ 2026
పేజీలు : 08



Follow :

# గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదుపై ఎమ్మెల్యే జారే ప్రత్యేక దృష్టి

## ఎమ్మెల్సీ అభ్యర్థి రామిరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గెలుపే లక్ష్యంగా విస్తృత పర్యటన



**చంద్రుగొండ, అక్టోబర్ 25 (జనం సాక్షి):** ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రామిరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గెలుపే లక్ష్యంగా అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదివారం చంద్రుగొండ మండలంలో విస్తృతంగా పర్యటించారు. మండలంలోని మద్దుకూరు, దామచర్ల, అయ్యన్నపాలెం, సీతాయిగూడెం, బెండాలపాడు తదితర గ్రామాలను సందర్శించి పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియను పరిశీలించారు.

ప్రతి పట్టభద్రుడి ఓటు నమోదయ్యేలా కృషి చేయాలి

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకునేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఒక్క అర్హుడి ఓటు కూడా నమోదు కాకుండా మిగిలిపోకూడదని, గ్రామాల వారీగా పట్టభద్రులను గుర్తించి ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఓటరు నమోదు ప్రక్రియలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సహకరించాలని తెలిపారు.

### ఉమ్మడి జిల్లాల్లో అభ్యర్థికి మెజారిటీ సాధించాలి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రామిరెడ్డి సర్వోత్తమ్ రెడ్డికి భారీ మెజారిటీ సాధించే దిశగా పార్టీ శ్రేణులన్నీ సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే కోరారు. ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల్లో అభ్యర్థికి మెరుగైన ఫలితాలు సాధించేందుకు గ్రామస్థాయి నుంచి నాయకులు, కార్యకర్తలు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో అభ్యర్థికి అత్యధిక మద్దతు లభించేలా కృషి చేసి నియోజకవర్గానికి గుర్తింపు తీసుకురావాలని పిలుపునిచ్చారు.



### గ్రామీణ సమస్యల పరిష్కారానికి కృషి

పర్యటనలో భాగంగా ఆయా గ్రామాల్లోని నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే సమావేశమై స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి కార్యక్రమాల అమలుకు ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్లమోతు వెంకటరమణ, భోజ్య నాయక్, అంకిరెడ్డి కృష్ణారెడ్డి, తుమ్మలపల్లి సురేష్, దారం గోవిందరెడ్డి, చిట్టెంశెట్టి మహేష్, బొర్రా సురేష్, సారేపల్లి శేఖర్, ఇమ్రాన్, ఇస్లావత్ రుక్మిణి, గుగులోతు బాబు, గుగులోతు రాములు, కిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలం ఆలయంలో భద్రగిరి శతకం పుస్తక ఆవిష్కరణ



**తుంగతుర్తి అక్టోబర్ 25 (జనం సాక్షి):** తుంగతుర్తి మండల కేంద్రానికి చెందిన ప్రముఖ పద్య కవి ఎర్రన (డా. యర్ర హరికిషన్) గారిచే రచించబడిన భద్రగిరి శతకం ఆదివారం పవిత్ర పుణ్యక్షేత్రం, దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలంలో కార్య నిర్వహణాధికారి శ్రీ కొల్లు దామోదర్ రావు మరియు శ్రీ రామదాసు పదవ తరం వారసులు శ్రీ కంచర్ల శ్రీనివాస రావు చేతులమీదుగా ఆవిష్కరణ చేశారు, ఈ భద్రగిరి శతకం పుస్తకంలో భద్రాచల ఆలయ నిర్మాణం, ఇక్కడి క్షేత్ర మహాత్మ్యాన్ని, భక్తుల అనుభవాలు, పర్ణశాలలో సీతారాముల వనవాస విహారం, శూర్పనఖ ఆగమనం, ఖరదూషనాదులతో కయ్యం, రావణబ్రహ్మ సీతాపహరణ ఘట్టం, జటాయువు పోరాటం, ఎటపాకలోని సాక్ష్యాలు, మరియు పరిసర ప్రాంతాలలో సీతారాముల సంచారం ఇతర విశేషాలను కవి ఎర్రన హృద్యంగా వర్ణించారు. మరియు భక్త రామదాసు ఆలయాన్ని నిర్మించిన విధానం, అర్చకులని నియమించిన విధానం పాంచరాత్రాగమ పద్ధతులను రూపొందించిన విధానం, నిత్యం ఆలయంలో జరిగే కైంకర్యాలు, పూజా విశేషాలను కూడా పద్య రూపంలో పొందుపరిచారు ఇక్కడే పుణ్య గోదావరి ప్రవాహాన్ని, పరిసర ప్రాంతాల్ని దివ్యసాకేత పురాన్ని, మిథిలా స్టేడియంలో జరిగే కళ్యాణోత్సవ సంరంభాలని ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసి ఆకలింపు చేసుకొని, ఈ క్షేత్రంలో జరిగే ప్రతి సన్నివేశాన్ని వివరించారు. మరియు కవి తన జీవిత చిత్రాన్ని మొత్తం ఈ క్షేత్రంతో పెనవేసుకున్న అనుబంధాన్ని నెమరేసుకోవడం జరిగింది, అదేవిధంగా ఈ ఆలయాల్లో పోకల ధర్మక్క మొదలు రామదాసు కు జరిగిన సన్నివేశాలు తానీషా రామదాసులో పెట్టిన విధానం చివరికి రామలక్ష్మణులు రామోజీ లక్ష్మోజీలుగా విచ్చేసి ఆరు లక్షల రామ మాడలను తానీషాకు అందించి రామదాసును విడిపించిన వైనాన్ని కూడా కళ్ళకు కట్టినట్లు, సులభశైలిలో పండిత పామరులకు కూడా అర్థమయ్యే రీతిలో చక్కగా రాగయుక్తంగా పాడుకునే విధంగా వర్ణించారు. తదనంతరం కవి ఎర్రన గారికి ఆలయ పక్షాన స్వామివారి దర్శనాన్ని అందించి, ఆశీర్వచనాన్ని, తీర్థప్రసాదాలు అందించి ఆలయ మర్యాదలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ముఖ్య కారునివాహణాధికారి శ్రవణ్ కుమార్, అర్చకులు సాయిబాబా, శ్రీ గడ్డం కృష్ణారెడ్డి, ఆలయ ఈవోఆర్బి సాయిబాబా ఆలయ సహాయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు

# హమాలి కార్మికులకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి

## హమాలి అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సారంగపాణి



టేకులపల్లి, అక్టోబర్ 25 (జనంసాక్షి): హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రగతిశీల హమాలి అండ్ మిల్ వర్కర్ యూనియన్ (ఐ ఎఫ్ టి యు )రాష్ట్ర అధ్యక్షుడు కొక్కు సారంగపాణి కోరారు. ఆదివారంటేకులపల్లిలో జరిగిన హమాలీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హమాలీ కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రేట్లు పెంచాలని అదేవిధంగా ప్రభుత్వం సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు.ఐ ఎఫ్ టి యు ఏరియా అధ్యక్షుడు బోడ మంచ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హమాలి పనిని నమ్ముకున్న కార్మికు లు వయసు మీద పడినంక ప్రభుత్వం నుండి ఎలాంటి పింఛన్ సౌకర్యం లేకపోవడంతో వృద్ధా ప్యంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. హమాలి కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, లేని యెడల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు.హమాలి కార్మికులకు ఇందిరమ్మ ఇల్లు,తెల్ల రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఐ ఎఫ్ టి యు రాష్ట్ర నాయకులు డి. ప్రసాద్ హమాలీ నాయకులు, భూక్య బాలాజీ, బోడా మంచ,దల్ సింగ్,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# పోనుగోడు గ్రామ పంచాయతీ భవన నిర్మాణం అసంపూర్తి

## ఏళ్లు గడుస్తున్న స్లాబ్ కె పరిమితం

**కనగల్లు అక్టోబర్ 25 (జనం సాక్షి)** మండలంలోని పోనుగోడు గ్రామంలో గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోవడంతో గ్రామస్తులు, అధికారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2014-15 ఆర్థిక సంవత్సరము లో 16 లక్షల 50 వేలరూపాయల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో ప్రారంభించిన పంచాయతీ భవనం పిల్లర్లు, స్లాబ్ వరకే పూర్తి చేసి అర్ధాంతరంగా వదిలేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు గోడలు, ప్లాస్టరింగ్, ఫ్లోరింగ్, తలుపులు, కిటికీలు వంటి పనులు అలాగే పెండింగ్ లో ఉన్నాయి. ప్రైవేట్ వ్యక్తుల వాహనాలకు నిలయంగా మారడం, సంచార జాతుల వారికి ఆశ్రయం , భవనం చుట్టూ పిచ్చి మొక్కలు మొలిచి, శిథిలావస్థకు చేరుకుంటోంది. స్లాబ్ పై నుంచి వచ్చిన ఇనుప చువ్వలు తుప్పు పట్టి పోతున్నాయి.



### వసతులు లేక అధికారుల అవస్థలు:

వసతులతో కూడినభవనం లేకపోవడంతో గ్రామ పంచాయతీ కార్యాలయం కొన్ని సంవత్సరాలుఇరుకైన అద్దె ఇండ్లల్లో కార్యకలాపాలు కొనసాగించడం ఇల్లును అద్దెకిచ్చిన యజమాని ఖాళీ చేయిస్తే మరొక భవనములోకి మారడం ఈ తంతాంగం జరుగుతున్న క్రమంలో శిథిలావస్థలో ఉన్న పాత భవనంలో ప్రస్తుతం గ్రామపంచాయతీ పాలక వర్గ సమావేశాలు, రోజువారి కార్యాలయ విధులు నిర్వర్తిస్తున్నారు .దీంతో గ్రామానికి సంబంధించిన ముఖ్యమైన రికార్డులు, జనన మరణ ధృవీకరణ పత్రాలు, ఇంటి పన్ను ఫైళ్లు, ఉపాధి హామీ రికార్డులు భద్రపరచడానికి స్థలం లేక అధికారులు తిప్పలు పడుతున్నారు. వర్షం వస్తే రికార్డులు తడిసిపోతాయని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.గ్రామ సభలు, సమావేశాలు నిర్వహించడానికి కూడా సరైన వసతి లేకపోవడంతో అధికారులు ఇబ్బంది పడుతున్నారు.

### మంత్రి దృష్టి పెట్టాలని గ్రామస్తుల వేడుకోలు:

అసంపూర్తిగా ఉన్న పంచాయతీ భవనాన్ని పూర్తి చేయడానికి జిల్లామంత్రి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలని పోనుగోడు గ్రామ ప్రజలు కోరుతున్నారు. తక్షణమే నిధులు మంజూరు చేసి, పెండింగ్ పనులు పూర్తి గావించి భవనాన్ని గ్రామానికి అంకితం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పంచాయతీ భవనాల నిర్మాణం ఇలా అసంపూర్తిగా వదిలేయడం వల్ల ప్రభుత్వ ధనం వృధా అవుతోంది. అధికారులు వెంటనే స్పందించి భవనాన్ని పూర్తి చేయాలి" అని గ్రామస్తులు పేర్కొంటున్నారు.



# గుర్రంపోడు వార్డు మెంబర్ల ఫోరం పగ్గాలు రేపాక శివకు

**గుర్రంపోడు, అక్టోబర్ 25 (జనంసాక్షి):** గుర్రంపోడు మండల వార్డు మెంబర్ల ఫోరం సమావేశం తెలంగాణ వార్డ్ మెంబర్ల ఫోరం రాష్ట్ర కోఆర్డినేటర్ పోగుల నాగార్జున రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రేపాక శివ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొమ్ము మహేష్, ప్రధాన కార్యదర్శిగా వాకిటి శివ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కూన్ రెడ్డి యాదయ్య, పొనుగోటి నరసింహ, బొల్లు ఇంద్రారెడ్డి, కురుపాటి మురళి, జల సైదులు, జక్కుల సైదులు ఎన్నికయ్యారు. మహిళా అధ్యక్షురాలిగా యానక మంగమ్మ, యూత్ అధ్యక్షుడిగా షేక్ జహీర్ పాషా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పోగుల నాగార్జున రెడ్డి మాట్లాడుతూ వార్డు మెంబర్ల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. వార్డు మెంబర్లకు నెలకు రూ.3,000 గౌరవ వేతనం, ప్రత్యేక హెల్త్ కార్డులు, మరణించిన వార్డు మెంబర్ కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే అభివృద్ధి పనుల శిలాఫలకాలపై వార్డు మెంబర్ల పేర్లు నమోదు చేసి, ప్రతి వార్డుకు ప్రత్యేక అభివృద్ధి నిధులు కేటాయించాలని కోరారు.

# మదీనా మస్జీద్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి శంకుస్థాపన



**కొండమల్లేపల్లి, అక్టోబర్ 25 (జనంసాక్షి):** మదీనా మస్జీద్‌లో ఆదివారం పలు మౌలిక వసతుల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మస్జీద్ కమిటీ అధ్యక్షుడు ఎం.ఏ. ఖాలేఖ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ఈద్గా కమిటీ అధ్యక్షుడు సయ్యద్ అజీమోద్దీన్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మస్జీద్‌లో భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు వాటర్ ట్యాంక్ నిర్మాణం, మరుగుదొడ్లు, ప్రహరీ గోడ, డోర్లు, ఫ్లోరింగ్ తదితర పనులు చేపట్టేందుకు కమిటీ సిద్ధమైంది. ఈ సందర్భంగా ఎం.డి. ఫారుఖ్ మౌలానా, సయ్యద్ మజీద్ మౌలానా, ముఫ్తీ రిజ్వాన్ సాహెబ్ ప్రత్యేక దువా నిర్వహించారు. మస్జీద్ అభివృద్ధి పనులు విజయవంతంగా పూర్తై, ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రావాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎం.డి. రహత్ అలీ, ఎం.డి. ఇలియాస్ పటేల్, ఎం.ఏ. ఖదీర్ సాలార్, ఎం.ఏ. వసీ, ఎం.డి. షకీల్, ఎం.డి. మునీర్, ఎం.ఏ. ఫసీ, ఎం.డి. గౌస్ భాయ్, ఎం.ఏ. షఫీ, ఎం.ఏ. అంజద్, సయ్యద్ అజీజ్, షంషోద్దీన్, ఎం.డి. ఫరాజ్, ఇలియాస్ బాబా, ఎం.డి. బాబా, ఎం.డి. జాకీ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లమీద ఊర కుక్కల సంచారం

**మస్త్ పరేషాన్ సుమీ..**



**పెనుబల్లి, అక్టోబర్ 25 (జనంసాక్షి):** గ్రామాల్లో ఊర కుక్కలు రోడ్లపై గుంపులు గుంపులుగా తిరుగుతూ పిల్లలకు, పాదచారులకు, వాహన చోదకులకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తున్నాయి. బజారుల్లో గుంపులు గుంపులుగా తిరుగుతూ పిల్లలను పెద్దలను గాయపరస్తూ బెంబేలెత్తిస్తున్నాయి.(రహదారులమీద గుంపులు గుంపులుగా సంచరిస్తూ ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తున్న వారికి ఊహించని విధంగా అడ్డు తగిలి రోడ్డు ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. ఒక్కోసారి ప్రాణాలు పోయినసందర్భాలు ఉన్నాయి. ఇప్పుడు గ్రామాల్లో అత్యంత ప్రధాన సమస్య కోతుల మూకతో పాటు, కుక్కల గుంపులు కూడా తోడైనాయి.

## మహాసభలను విజయవంతం చేయాలి

# టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి




**నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 25,(జనం సాక్షి):** తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) నల్లగొండ జిల్లా విద్యా వైజ్ఞానిక మహాసభలను నవంబర్ 1, 2 తేదీల్లో కట్టంగూరులో నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యాభిమానులు, ప్రజాస్వామికవాదులు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నల్లగొండలోని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం సంఘం జిల్లా అధ్యక్షుడు బక్కా శ్రీనివాసచారి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, ప్రభుత్వ విద్యావ్యవస్థ బలోపేతం, విద్యార్థులందరికీ నాణ్యమైన ఉచిత విద్య అందించడం వంటి కీలక అంశాలపై మహాసభల్లో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడేందుకు, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల సాధనకు టీఎస్‌యూటీఎఫ్ నిరంతరం కృషి చేస్తోందన్నారు. విద్యారంగంలో సమూల మార్పులు తీసుకురావడంతోపాటు సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజాస్వామిక విలువల పరిరక్షణ కోసం ఉపాధ్యాయులంతా ఐక్యంగా ముందుకు రావాలని కోరారు.

**రెండు రోజుల మహాసభల కార్యక్రమాలు:** మహాసభల మొదటి రోజు ఎఫ్ఎల్ఎన్--టీఎల్ఎం మేళాతోపాటు చైతన్య సదస్సు నిర్వహించనున్నారు. ఇందులో భారతదేశ ఆర్థిక అభివృద్ధిలో మధ్యతరగతి ఎక్కడ? అనే అంశంపై ప్రొఫెసర్ డాక్టర్ కె. నాగేశ్వరరావు ప్రసంగించనున్నారు. అలాగే విద్యాసంస్థల్లో విద్యార్థుల అభ్యసన సమస్యలు, కారణాలు, పరిష్కారాలుఅనే అంశంపై ప్రొఫెసర్ డాక్టర్ బెల్లి యాదయ్య ప్రసంగించనున్నారు. రెండో రోజు డీఎస్పీ శివరామరెడ్డి చేతుల మీదుగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించనున్నారు. అనంతరం ప్రతినిధుల సభ, నివేదికల సమర్పణ, చర్చలు, తీర్మానాలు నిర్వహించి జిల్లా నూతన కమిటీని ఎన్నుకోనున్నారు. ఈ సందర్భంగా నవంబర్ 1, 2 తేదీల్లో కట్టంగూరులో జరిగే జిల్లా మహాసభలకు సంబంధించిన గోడపత్రికను నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డబ్ల్యూఎస్ రాష్ట్ర కోశాధికారి ఎడ్ల సైదులు, జిల్లా ఉపాధ్యక్షులు నర్రా శేఖర్‌రెడ్డి, బడుగు అరుణ, రాష్ట్ర కమిటీ సభ్యురాలు జాల అరుణ, జిల్లా కార్యదర్శులు చిక్కుల రామలింగయ్య, గేర నరసింహ, మోర్తాల శ్రీనివాస్‌రెడ్డి, నలపరాజు వెంకన్న, అడావత్ చిన వెంకన్న, కోట్ల యాదగిరి, పగిళ్ల సైదులు, గంటెల వెంకటయ్య, కొమర్రాజు సైదులు, గుండా వేదశ్రీ, ఆడిట్ కమిటీ కన్వీనర్ మిట్టపల్లి మురళయ్య, సభ్యులు మధుసూదన్‌రెడ్డి, తాటిపాముల నరసింహమూర్తి, భాను ప్రకాష్, వాయిస్ ఆఫ్ తెలంగాణ టీచర్ కన్వీనర్ దాసరి ప్రభాకర్, సాంస్కృతిక కమిటీ కన్వీనర్ గిరి యాదయ్య, సోషల్ మీడియా కన్వీనర్ యరనాగుల సైదులు, స్టడీ సర్కిల్ కన్వీనర్ రాగి రాకేష్‌కుమార్, ఎస్‌టీఎఫ్ఐ మహిళా కన్వీనర్ గోన శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# సమాన పనికి సమాన వేతనం కొరకు పోరాడుదాం




**కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ యాకుబ్ షావలి**

**టేకులపల్లి, అక్టోబర్ 25(జనంసాక్షి):** సమాన పనికి సమాన వేతనం కోసం పోరాడుదామని ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ యాకుబ్ షావలి, ఏరియా కార్యదర్శి జరుపుల సుందర్ పిలుపునిచ్చారు. ఆదివారం టేకులపల్లి సింగరేణి హైటెక్ కాలనీలో కాంట్రాక్ట్ కార్మికుల జనరల్ బాడీ సమావేశం గూగుల్ మదర్ అధ్యక్షతన జరిగింది. ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ టియుసిఐ అనుబంధం రాష్ట్ర జనరల్ బాడీ ఈ నెల 30న ఇల్లందు ఎల్లన్న విజ్ఞాన భవనంలో జరగనున్నందున జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ యాకుబ్ షావలి ఏరియా కార్యదర్శి జరుపూల సుందర్ పాల్గొని మాట్లాడుతూ సింగరేణి కాంట్రాక్టుకార్మికుల వేతనాలు, 9 సంవత్సరాల నుండి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెంచడం లేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు 2016లో సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని తీర్పునిచ్చిన, ఈ ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని ఐక్య ఉద్యమాల కొరకు ఈ నెల 30న ఇల్లందులో జరుగు జనరల్ బాడీ సమావే శాన్ని సింగరేణి కాంట్రాక్టు కార్మికులు యూనియన్ల కతీతంగా జనరల్ బాడీలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం రీజియన్ నాయకులు ప్రసాద్, శివయ్య ఎర్రమ్మ బాలు, రవి సూర్య, భోజియా నాగమణి, జ్యోతి, సోమ్లా, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రుపాలెం మండల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**ఎర్రుపాలెం, అక్టోబర్ 25 (జనంసాక్షి):** ఎర్రుపాలెం మండల ప్రెస్ క్లబ్ కార్యవర్గ సమావేశం ఆదివారం జమలాపురంలోని బాలాజీ భవనంలో మాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు యరమల శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల ప్రక్రియను సీనియర్ జర్నలిస్టులు పర్యవేక్షించారు. గౌరవ అధ్యక్షులుగా యరమల శ్రీనివాసరెడ్డి, గౌరవ సలహాదారులు గా యనమందల విష్ణువర్ధన్ రావు, ముఖ్య సలహాదారులు గా గంధం శ్రీనివాసరావు, అంగిరేకుల. రామకృష్ణ అధ్యక్షులు గా తోట సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి గా కోనా రమేష్, కార్యదర్శి గా ఉయ్యూరు శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ గా నాగిరెడ్డి రమేష్ ఉపాధ్యక్షులుగా కుక్కల మురళీకృష్ణ, పసుపులేటి మహేష్, కోశాధికారిగా కాపర్తి సతీష్ కార్యవర్గ సభ్యులుగా మారబత్తుల సుష్మతేజ, వేమిరెడ్డి శివలింగారెడ్డి, ఆకుల రవి, బొబ్బిళ్లపాటి క్రిస్టఫర్, రాజారపు శ్రీనివాసరావు, బాణాల శంకరాచారి, కె. సుధాకర్ రెడ్డి, ఎం. వెంకటశ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



# జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 25( జనం సాక్షి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఖమ్మం జిల్లాలో రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

భారత వాతావరణ శాఖ అక్టోబర్ 25న జారీ చేసిన వాతావరణ బులెటిన్ ప్రకారం ఈ నెల 27న జిల్లాలో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు.

అక్టోబర్ 28న జిల్లాలో అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలతో పాటు అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించిందని పేర్కొన్నారు. అక్టోబర్ 29న కూడా అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. వర్షాల నేపథ్యంలో రైతులు అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

ఉరుములు, మెరుపులు సంభవించే సమయంలో ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని, చెట్ల క్రింద, విద్యుత్ స్తంభాల సమీపంలో ఆశ్రయం పొందరాదని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని సంబంధిత శాఖల అధికారులు వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికలు, జిల్లా యంత్రాంగం జారీ చేసే సూచనలను ప్రజలు, రైతులు తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# సమాజ వికాసమే సాహిత్యం




ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 25 ( జనం సాక్షి ): ఈరోజు డా పట్టాభి కళాపీఠం ఆధ్వర్యం లో డా తూములూరి రాజేంద్ర ప్రసాద్ సంపాదకత్వం లో గుంటూరు యస్ హే ఓ కార్యాలయం లో “ భారత దేశంలో రాజకీయ పార్టీల పిరాయి 0పులు “ కవితా సంకలనం ను కార్యక్రమానికి విశిష్ట అతిథి గా హాజరైన తెలంగాణ రాష్ట్ర వికాస వేదిక సాహిత్య సంస్థ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి ప్రజాకవి లెనిన్ శ్రీనివాస్ ఆవిష్కరించారు . సభకు డా తూములూరి రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా పిల్లల వైద్యురాలు టి సుస్మిత హాజరు కావడం సభను ఉద్దేశించి సమాజం సంక్షోభ స్థితిలో ఉంది రాజకీయాలు ప్రజా సంక్షేమము వదిలేసి ఒకరి మీద ఒకరు మాటల యుద్ధాలను చేస్తూ వ్యవస్తను నిర్వీర్యం చేస్తూ నియంతలా పాలించడం ప్రశ్నించే హక్కును కాలరాయడం ఊసర వెల్లుల కన్నా దిగజారి నైతిక విలువలకు పాతరేసి పార్టీలు మారడం శోచనీయం కాగా డబ్బుతో రాజకీయాలను శాశిస్తూ పెద్దాయన ఆయన కొడుకు మనుమడు ఇలా వారే ఉన్నంత కాలం రాజ్యమేలే పన్నాగాలు చేస్తూ ప్రజాస్వామ్యం నిర్వీర్యం చేస్తూ అందిన కాడికి దోస్తు దోచిన దాన్ని రక్షణ కవచంగా రాజకీయము చేస్తున్నారని అందుకే సమాజం నుండి కులము మతము తరిమి వేయబడిన నాడు ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది లెనిన్ శ్రీనివాస్ తెలియజేశారు .

పిల్లలకు సాధ్యమైనంత దూరంలో సెల్లు ఫోన్లు ఉంచాలని వారి ఎదుగుదల పై తీవ్ర ప్రభావం ఉంది మానసిక రోగులుగా తయారవుతారని వారికి ప్రసిద్ధ సంఘటనలు చందమామ కథలు స్ఫూర్తి దాయక చరిత్రలు చెప్పాలని డా టి సుస్మిత వివరించారు . డా తూములూరి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ డా పట్టాభి కళాపీఠం ఆధ్వర్యం లో అనేక ఆలోషింప దగ్గ కార్యక్రమాలతో ప్రభుత్వం గుర్తించలేని వారి గుర్తించి వారిని సమున్నతంగా గౌరవిస్తూ సమాజ హితాన్ని కోరే అనేక పుస్తకాలను ముద్రించి సాహితీ లోకం ముందుకు తీసుకు వచ్చిందని వివరించారు .

# పట్టభద్రులంతా ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి

## కల్లూరు మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్



కల్లూరు అక్టోబర్ 25(జనం సాక్షి): సత్తుపల్లి శాసన సభ్యురాలు మట్ట రాగమయి దయానంద్ ఆదేశానుసారం ఖమ్మం--వరంగల్--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు అర్హులైన పట్టభద్రులు తమ పేరును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కల్లూరు మున్సిపాలిటీ చైర్మన్ ధారావత్ మోహన్ నాయక్ ఆదివారం ఒక ప్రకటనలోకోరారు ఓటు నమోదు కౌంటర్ ను కల్లూరు మున్సిపల్ ఆఫీసులో ప్రారంభించడం జరిగిందని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదుకు2023 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ పూర్తి చేసిన అర్హులు డిగ్రీ మెమోఆధార్ కార్డు, పాస్ ఫొటో, మొబైల్ నంబర్ వివరాలతో ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నవంబర్ 6, 2026 దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ అని పేర్కొంటూ, గడువు ముగిసేలోపే అర్హులైన పట్టభద్రులందరూ తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని కోరారు.



# లడబజార్ అయ్యప్ప భక్త బృందం ఆధ్వర్యంలో 41 మంది యువకుల మాలాధారణ

**మధిర, అక్టోబర్ 25 (జనంసాక్షి):** మధిర పట్టణం లోని లడక్ బజార్ అయ్యప్ప భక్త బృందం చెరుపల్లి శ్రీధర్ గురుస్వామి ఆధ్వర్యంలో లడక బజార్, బంజారా కాలనీకి చెందిన 41 మంది యువకులు స్థానిక అయ్యప్ప స్వామి ఆలయం నందు అయ్యప్ప స్వామి మాలధారణ గావించుకొని 41 రోజుల మండల దీక్షను ప్రారంభించారు. అయ్యప్ప స్వామి నామస్మరణ.. భక్తి పారవశ్యం.. శరణుఘోషల నడుమ అయ్యప్ప స్వామి ఆలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. నిష్ఠ, నియమాలతో స్వామివారి దీక్ష చేపట్టిన భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. అయ్యప్ప స్వామి ఆశీస్సులతో దీక్షను విజయవంతంగా పూర్తి చేయాలని గురుస్వాములు భక్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు వలిశెట్టి శ్రీనివాసరావు, దొంతెబోయిన హనుమంతరావుతో పాటు అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

# గౌస్ పాషా కుటుంబానికి భూక్యా అశోక్ ఆర్థిక సాయం



**ఖమ్మం, అక్టోబర్ 25 (జనం సాక్షి):** తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఎస్.కె. గౌస్ పాషా కుటుంబానికి బీఆర్ఎస్ నాయకులు భూక్యా అశోక్ మానవతా దృక్పథంతో ఆర్థిక సహాయం అందించి ఆదుకున్నారు. ఖమ్మం 8వ డివిజన్ పరిధిలోని వైఎస్ఆర్ కాలనీ (ఓల్డ్ డబుల్ బెడ్రూమ్, బ్లాక్ నంబర్-1)లో నివాసముంటున్న ఎస్.కె. గౌస్ పాషా గత కొంతకాలంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకున్న భూక్యా అశోక్ వెంటనే స్పందించారు. ఆదివారం వారి నివాసానికి వెళ్లి పరామర్శించి, కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చికిత్స, కుటుంబ ఖర్చుల నిమిత్తం తక్షణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భూక్యా అశోక్ మాట్లాడుతూ.. కుటుంబ సభ్యులు ఎవరూ అధైర్యపడొద్దని, ఎలాంటి అవసరం వచ్చినా కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఆపదలో ఉన్నవారికి చేతనైన సహాయం అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.

# గొల్లగూడెంలో బీసీ హక్కుల సాధన సమితి సమావేశం

**ఖమ్మం రూరల్, అక్టోబర్ 25 (జనం సాక్షి ):** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని గొల్లగూడెంలో సిపిఐ పార్టీ అనుబంధ సంఘమైన బీసీ హక్కుల సాధన సమితి ప్రథమ మహాసభను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలానా ముఖ్య అతిథులుగా హాజరై బీసీ హక్కుల పోరాటానికై చేయవలసిన విధివిధానాలపై దిశా నిర్దేశం చేశారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొలిశెట్టి వేణు ఉపాధ్యక్షుడిగా మండలి సైదులు కార్యదర్శిగా వీరబోయిన మధు సహాయ కార్యదర్శిగా గోపయ్య దంతాల మైసూర్ తో పాటు కమిటీ సభ్యులు నియామకమయ్యారు. ఈ కార్యక్రమంలో తాటి వెంకటేశ్వరరావు, మేకల




శ్రీనివాసరావు, సిద్దినేని కర్ణ కుమార్, లాయర్ శేషగిరి, వీరభద్రం, బట్ట బాబు, కౌన్సిలర్ దండి రంగారావు తదితరులు పాల్గొన్నారు



# కామ్రేడ్ ఇస్లావత్ స్వాతి సంతాప సభ

**ఖమ్మం కార్పొరేషన్ అక్టోబర్ 25 ( జనం సాక్షి ):** ప్రగతిశీల మహిళా సంఘం ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పి ఓ డబ్ల్యు ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షురాలు టి ఝాన్సీ అధ్యక్షతన కామ్రేడ్ ఇస్లావత్ స్వాతి సంతాప సభ ఖమ్మం ఆఫీసులో జరిగింది ఈ కార్యక్రమంలో ప్రగశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ శిరోమణి పాల్గొని మాట్లాడుతూ హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ చనిపోయారు. కామ్రేడ్ స్వాతి మహిళా సంఘం, కార్యక్రమాలలో చాలా చురుకుగా పాల్గొనే వారని అన్నారు సిపిఐ ఎం ఎల్ మాస్ లైన్ పార్టీ అంటే ఎనలేని ప్రేమ అభిమానాలు చూపేది. గ్రామంలో మహిళలను సమీకరించి, పోరాటాలలో భాగస్వాములను చేసే ది. మహిళలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ, నిర్వహించిన కార్యక్రమాలకు నాయకత్వం వహించింది. రైతు కూలీలు ఎదుర్కొంటున్న గిట్టుబాటు ధరలు కనీస వేతనాలు సాధనకై జరిగిన పోరాటాలలో తన వంతు పాత్రను పోషించింది. గ్రామాభివృద్ధికై పార్టీ నాయకత్వం చేసిన కృషిలో తన వంతు పాత్రను పోషించారు. చిన్ననాటి నుండి గ్రామంలో విప్లవ పార్టీ కార్యక్రమాలకు ఆకర్షితురాలై మంచి ఆర్గనైజర్ గా మహిళా సంఘం లో డివిజన్ అధ్యక్షురాలు స్థాయికి ఎదిగినది. మహిళా సంఘం కార్యక్రమాలకు మహిళలను కదిలిస్తుంది. ముఖ్యంగా పేదవాళ్లకు వైద్యం అందుబాటులో ఉండాలని మండల జిల్లా కేంద్రంలో ప్రగతి శీల మహిళా సంఘం నిర్వహించిన కార్యక్రమాలకు మహిళలను కదిలించిందని ఆమె అన్నారు కులాంతర వివాహం చేసుకొని ఆదర్శ మహిళగా గ్రామంలో పేరు తెచ్చుకున్నది. స్వాతికి ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. ప్రజలతో కలివిడిగా, చొరవగా మాట్లాడుతూ ఉంటుంది. సిపిఎంఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 30వ తేదీన ఖమ్మం లో రామ నర్సయ్య విజ్ఞాన కేంద్రంలో కులాంతర వివాహాలను చేసుకున్న దంపతుల కు సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నదని స్వాతి చేసిన ఉద్యమాలని కొనియాడారు.. ఇస్లావత్ స్వాతి నమ్మిన ఆశయాలు అభిప్రాయాలు సాధన కోసం కృషి చేద్దామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి పి శోభ. పరిమళ లలిత వెంకట నరసమ్మ లక్ష్మి వనిత జ్యోతి శారద తేజ లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కాంటావేసేహమాలీలతో ముచ్చటించిన మంత్రి తుమ్మల

**కల్లూరు అక్టోబర్ 25(జనం సాక్షి):** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం మధ్యాహ్నం కల్లూరు వెళుతూ మార్గమధ్యలో గోపాల దేవన బోయినపల్లి గ్రామం వద్ద కార్ దిగి ధాన్యం కాటా వేస్తున్న హమాలీలతో వ్యవసాయ సంబంధిత అంశాలపై ముచ్చటించారు. ఈ సందర్భంగా ధాన్యం కాటా వేసే హమాలీ కార్మికులతో, సరదాగా ముచ్చటించారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో కల్లూరు మండలంలో వరి పంట సాగు ఎలా ఉన్నది,ధాన్యం దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయా, ధాన్యంరేటు ఎంత ఉన్నది అంటూ వివరాలు అడిగి తెలుసుకున్నారు.
రాష్ట్రంలో ఎల్ నీవో ప్రభావం ఉన్న వ్యవసాయ శాఖ మంత్రిగా, రైతుబిడ్డగా రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ముందు చూపుతో తమరుగోదావరి జలాలు విడుదల చేయటం వల్ల రైతులు సంతోషంగా ఉన్నారని మంత్రికి వివరించారు .

మా మండలంలో వరి సాగు ఎక్కువగా ఉన్నదని.మీ దయతోనే ఈ ప్రాంతంలో గోదావరి జలాలు రావడంతో వరి పంటకు నీటి ఎద్దడి లేకుండా సకాలంలో వరి పంట చేతి కంది వచ్చిందని, తమకు జీవితాంతం రుణపడి ఉంటామని హమాలీలు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కుతెలిపారు. మార్గమధ్యలో మంత్రి తుమ్మల కారు ఆపి తమతో మాట్లాడటం పట్ల హమాలీలు, రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ మంత్రి తుమ్మలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు సీనియర్ కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్రావు, చల్లగుండ్ల నరసింహారావు పాల్గొన్నారు.



# ప్రాజెక్టు పుట్టిన అశ్వాపురానికి సాగునీరు ఏదీ?

- మంత్రి తుమ్మల పర్యటనలతో రైతులకు ఒరిగిందేమిటి?
- ఎమ్మెల్యే పాయం స్పందించాలి.. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ డిమాండ్



**అశ్వాపురం, అక్టోబర్ 25 (జనంసాక్షి):** సీతారామ ప్రాజెక్టు కోసం భూములు ఇచ్చిన అశ్వాపురం ప్రాంత రైతులకు సాగునీటి విషయంలో న్యాయం జరగడం లేదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ విమర్శించారు. ఇతర ప్రాంతాలకు నీటిని తరలించే చర్యలు చేపడుతున్న ప్రభుత్వం, ప్రాజెక్టు కోసం భూములు త్యాగం చేసిన స్థానిక రైతులకు సాగునీరు అందించడంపై ఎందుకు స్పష్టత ఇవ్వడం లేదని ప్రశ్నించారు.

**పర్యటనలు కాదు.. రైతులకు నీళ్లివ్వాలి!**

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సాగునీటి ప్రాజెక్టుల సందర్శనలు చేస్తున్నప్పటికీ, అశ్వాపురం రైతుల సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదని అమరేందర్ ఆరోపించారు. పర్యటనలు, ప్రకటనలకే పరిమితం కాకుండా రైతులకు సాగునీరు అందించే కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇతర ప్రాంతాలకు నీటిని తరలించే ముందు స్థానిక రైతుల అవసరాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు.

**ఎమ్మెల్యే పాయం ఎందుకు ప్రశ్నించడం లేదు?**

అశ్వాపురం రైతుల సాగునీటి సమస్యపై స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని ఎందుకు నిలదీయడం లేదని అమరేందర్ ప్రశ్నించారు. ప్రజాప్రతినిధిగా తన ప్రాంత రైతుల హక్కుల కోసం గళమెత్తాలని సూచించారు. ప్రభుత్వ నిర్ణయాలకు మద్దతు పలకడమే కాకుండా, రైతులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని అన్నారు.

**నీటి కేటాయింపులపై స్పష్టత ఇవ్వాలి:**

సీతారామ ప్రాజెక్టు ద్వారా అశ్వాపురం ప్రాంతానికి ఎంత నీరు కేటాయిస్తారు, ఎప్పుడు సరఫరా చేస్తారు, ఎంత ఆయకట్టుకు సాగునీరు అందిస్తారో ప్రభుత్వం వెల్లడించాలని అమరేందర్ డిమాండ్ చేశారు. భూములు ఇచ్చిన రైతులకు ప్రాజెక్టు ప్రయోజనాలు అందించడం ప్రభుత్వ బాధ్యతని పేర్కొన్నారు. పర్యటనలు, హామీలతో కాలం గడపకుండా అశ్వాపురం రైతులకు సాగునీరు అందించి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# నల్గొండలో ఏఐకేఎస్ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి

**మధిరలో ఎడ్లబండ్ల ర్యాలీ నిర్వహించనున్న ఏఐకేఎస్ నాయకులు**



**మధిర, అక్టోబర్ 25 (జనంసాక్షి):** నవంబర్ 15 నుంచి 18 వరకు నల్గొండలో నిర్వహించనున్న అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ మధిర పట్టణంలో ఏఐకేఎస్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఎడ్లబండ్ల ర్యాలీ స్థానిక మార్కెట్ యార్డ్ నుండి ప్రారంభమై అంబేద్కర్ సెంటర్ మెయిన్ రోడ్డు నుండి జీలుగుమాడు వరకు నిర్వహించనున్నారని సిపిఎం పార్టీ డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు తెలిపారు. వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సంక్షోభం, రైతుల సమస్యల పరిష్కారంలో ఈ మహాసభలు కీలకమని పేర్కొన్నారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి చారిత్రక నేపథ్యమున్న నల్గొండ గడ్డపై జాతీయ మహాసభలు నిర్వహించడం ప్రత్యేక ప్రాధాన్యత కలిగి ఉందన్నారు. నవంబర్ 15న లక్షలాది మంది రైతులతో మహా ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా 400కు పైగా రైతు సంఘాలకు చెందిన ప్రతినిధులు ఈ మహాసభల్లో పాల్గొననున్న నేపథ్యంలో రైతులు, ప్రజలు పార్టీలకు అతీతంగా సహకరించి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

**పట్టభద్రుల ఓటరు నమోదుపై అవగాహన**

ఖమ్మం--నల్గొండ--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. గతంలో ఓటు హక్కు ఉన్నవారు సైతం కొత్తగా నమోదు చేసుకోవాలని, నవంబర్ 5వ తేదీలోపు నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచించారు. మండలిలో రైతులు, వ్యవసాయ కార్మికులు, పేదలు, కార్మికుల సమస్యలను ప్రస్తావించేందుకు సీపీఎం, ప్రజాసంఘాలు బలపరిచే అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. పట్టబద్దర్ల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సిపిఎం పార్టీ అభ్యర్థి పోటీలో ఉంటారని, అభ్యర్థిని త్వరలో ప్రకటించనున్నట్లు తెలిపారు.

# బీఆర్ఎస్ కార్యకర్తలకు దిశ నిర్దేశం

**ఎమ్మెల్సీ ఇంచార్జ్ చాడ ముచ్చర్లలో సన్నాహక సమావేశం**

**కామేపల్లి, అక్టోబర్ 25 (జనంసాక్షి):** రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకుని పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియను క్షేత్రస్థాయిలో వేగవంతం చేయడమే లక్ష్యంగా ముచ్చర్లలో మేధావులు కార్యకర్తలు పట్టభద్రుల తో బీఆర్ఎస్ శ్రేణులు సమాయత్తమయ్యాయి. ఆదివారం ముచ్చర్ల బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు తూము బాబు నివాసం వద్ద నిర్వహించిన సన్నాహక సమావేశం స్థానిక నాయకులు, కార్యకర్తల అభిమానులు ఉత్సాహపూరిత వాతావరణం నడుమ జరిగింది. ఈ కార్యక్రమానికి ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్సీ ఇంచార్జ్ చాడ కిషన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎమ్మెల్సీ సభ్యత్వ నమోదును ప్రణాళికాబద్ధంగా నిర్వహించి,పార్టీ బలాన్ని ప్రతి గ్రామంలోనూ నిరూపించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. సభ్యత్వ నమోదును ఎలా చేపట్టాలి, నమోదు ప్రక్రియలో ఎదురయ్యే సాంకేతిక అంశాలను ఏ విధంగా పరిష్కరించుకోవాలి అనే విషయాలపై నాయకులకు, శ్రేణులకు ఆయన స్పష్టమైన దిశా నిర్దేశం చేశారు. ప్రతి ఒక్క కార్యకర్త నిబద్ధతతో పనిచేసి నమోదు లక్ష్యాలను పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు బానోత్ హరి సింగ్,మండల సమన్వయ కమిటీ సభ్యులు అంతోటి అచ్చయ్య, మూడు కృష్ణ ప్రసాద్,సామా మోహన్ రెడ్డి, మల్లెంపాటి శ్రీనివాసరావు, వడియాల కృష్ణారెడ్డి,కాట్రాల రాంబాబు, తూము శ్రీనులతో పాటు వివిధ గ్రామాల సర్పంచులు జాటోత్ లూసి, మాలోత్ కిషన్, ప్రసాద్,ఉప సర్పంచ్ గడ్డం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అదేవిధంగా పార్టీ ముఖ్య నాయకులు సతాకూటి హనుమంతరావు, ఆదూరి ప్రసాద్, చిప్పలపల్లి శ్రీనివాసరావు, రామకృష్ణ, కన్నమాల రాంబాబు, దుద్దుకూరి రాంబాబు తదితరులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



### ఉద్యోగ బాధ్యతల మధ్య..

# దర్శకుడిగా ప్రతిభా ప్రస్థానం!

- చిన్న చిత్రంతో సత్తా చాటిన యువకుడు శనగ రవీంద్రబాబు
- హైదరాబాద్‌లో ఘనంగా తొలి చిత్ర ప్రదర్శన



**బూర్గంపహాడ్ అక్టోబర్ 25 (జనంసాక్షి):** ప్రభుత్వ ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తూనే సినీ రంగంపై తనకున్న మక్కువతో దర్శకుడిగా ముందడుగు వేస్తున్నారు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం మొరంపల్లి బంజర్‌కు చెందిన శనగ రవీంద్రబాబు. ఉద్యోగ జీవితాన్ని కొనసాగిస్తూనే తన సృజనాత్మకతకు పదును పెట్టి 'ఏడీఎస్' పేరుతో లఘుచిత్రాన్ని రూపొందించారు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్ర తొలి ప్రదర్శన ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఘనంగా జరిగింది.

**అభిరుచికి పట్టుదల తోడై..**

సినిమా రంగంలో రాణించాలనే ఆసక్తి ఉన్నప్పటికీ ఉద్యోగ బాధ్యతల కారణంగా చాలామంది తమ కలలకు దూరమవుతుంటారు. అందుకు భిన్నంగా రవీంద్రబాబు విధులను నిర్వర్తిస్తూనే తన ఖాళీ సమయాన్ని సినీ సృజనకు కేటాయించారు. కథ, కథనం, సంభాషణలు, దర్శకత్వంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ లఘుచిత్రాన్ని రూపొందించారు. ఉద్యోగం చేస్తూనే మనసుకు నచ్చిన రంగంలోనూ ప్రతిభను నిరూపించుకోవచ్చని తన ప్రయత్నం ద్వారా చాటుతున్నారు.

**ప్రేక్షకుల ముందుకు 'ఏడీఎస్'**

రవీంద్రబాబు దర్శకత్వంలో రూపొందిన 'ఏడీఎస్' లఘుచిత్రాన్ని హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ప్రదర్శించడం ఆయన సినీ ప్రయాణంలో కీలక ముందడుగుగా నిలిచింది. తన ఆలోచనలను తెరపై ఆవిష్కరిస్తూ దర్శకుడిగా గుర్తింపు పొందేందుకు ఆయన చేస్తున్న ప్రయత్నం అభినందనీయం.

**యువతకు స్ఫూర్తిదాయకం..**

ప్రతిభ ఉన్నా అవకాశాలు రావడం లేదని నిరాశ చెందే యువతకు రవీంద్రబాబు ప్రయాణం స్ఫూర్తినిస్తోంది. ఉద్యోగ బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూనే తమ అభిరుచికి అనుగుణంగా కృషి చేస్తే లక్ష్యాల దిశగా ముందుకు సాగవచ్చని ఆయన నిరూపిస్తున్నారు. మొరంపల్లి బంజర్‌కు చెందిన యువకుడు దర్శకుడిగా ఎదిగేందుకు ప్రయత్నించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భవిష్యత్తులో మరిన్ని మంచి చిత్రాలను రూపొందిస్తూ సినీ రంగంలో ఉన్నత స్థాయికి ఎదగాలని, తన స్వగ్రామానికి మంచి పేరు తీసుకురావాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు. పట్టుదలతో అడుగులు వేస్తే అభిరుచిని విజయంగా మలుచుకోవచ్చని రవీంద్రబాబు ప్రయాణం చాటిచెబుతోంది.

# ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలి

- వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి
- రైతులు ఆరుతడి పంటలకు ప్రాధాన్యమివ్వాలి
- పినపాక మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పేరం వెంకటేశ్వర్లు

**పినపాక, అక్టోబర్ 25(జనం సాక్షి):** ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించేందుకు కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పినపాక మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పేరం వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం పినపాక మండలం ఏడూళ్ల బయ్యారం క్రాస్‌రోడ్డులోని కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిరోజూ ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకొని, డిగ్రీ పూర్తి చేసిన యువతను గుర్తించి ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు సహకరించాలని నాయకులకు సూచించారు. నవంబర్ 6వ తేదీ వరకు ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేలా నాయకులు కృషి చేయాలని కోరారు. ప్రతి కార్యకర్త పార్టీ అభివృద్ధికి తన వంతు సహకారం అందించాలని సూచించారు.

**వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలి**

వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామపంచాయతీల పరిధిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా సర్పంచులు, ఉపసర్పంచులు ముందస్తు చర్యలు చేపట్టాలని పేరం వెంకటేశ్వర్లు సూచించారు. గ్రామాల్లో తాగునీటి లభ్యతను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని కోరారు. గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి స్థానిక ప్రజాప్రతినిధులు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు.

**ఎల్నినో ప్రభావంపై రైతులు అప్రమత్తంగా ఉండాలి**

వాతావరణ మార్పులు, ఎల్నినో ప్రభావం నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని తెలిపారు. రైతులకు అవసరమైన అవగాహన కల్పించేందుకు నాయకులు కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్సీ ఓటరు నమోదు, గ్రామాల్లో తాగునీటి సమస్యల నివారణ, రైతులకు అవగాహన కల్పించడం వంటి అంశాల్లో నాయకులు సమన్వయంతో పనిచేయాలని పేరం వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తోలెం కళ్యాణి, డీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ బోడా రమేష్, దిశా కమిటీ సభ్యుడు మద్దెల సమ్మయ్య, సర్పంచులు వెంకటేష్, అలివేలు, బాబురావు, శివశంకర్, అనిత, ఉమామహేశ్వరి, స్వప్న, సుహాసిని, సింధు, నాగకుమారి, భవతి, చందర్రావు, ఉపసర్పంచులు రాజేష్, రామ్మోహన్, శిరీష, నవీన్, లెనిన్, సందీప్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉడుముల లక్ష్మారెడ్డి, గంగిరెడ్డి వెంకటరెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## బుద్ధవనంలో 'శ్రీశ్రీ మార్గం' కవితా సంకలనం ఆవిష్కరణ




**భద్రాచలం కవుల ప్రతిభకు ప్రశంసలు**

**భద్రాచలం, అక్టోబరు 25 (జనంసాక్షి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా : తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో బుద్ధవనం వేదికగా నిర్వహించిన రెండు రోజుల యువ సాహిత్యోత్సవం--2026లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శాఖ ప్రచురించిన అంతర్రాష్ట్ర శతాధిక కవితా సంకలనం 'శ్రీశ్రీ మార్గం' ఆవిష్కరణ జరిగింది. ప్రముఖ కవులు, సాహిత్య విమర్శకులు సీతారాం, వీబీకే స్వామి పుస్తకాన్ని ఆవిష్కరించగా, సంపాదకుడు, తెలంగాణ సాహితి భద్రాచలం శాఖ అధ్యక్షుడు తాతోలు దుర్గాచారిని అభినందించారు. ఈ ఉత్సవంలో పాల్గొని ప్రతిభ చాటిన భద్రాద్రి కవులు కాలం సాయి కుమారి, బొల్లు రాజ్యలక్ష్మిలను మాల్యశ్రీ, జి.ఎస్. శంకరరావు, మాగంటి సాయి సూర్య, సోంపాక సీత తదితర ప్రముఖులు అభినందించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 200 మంది యువ కవులు, రచయితలు ఈ సాహిత్యోత్సవంలో పాల్గొన్నారు.

## ఎంజేపీ గురుకుల ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడిగా లివింగ్‌స్టన్

**టీఎస్‌యూటీఎఫ్ అనుబంధ విభాగం రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక**

**ఖమ్మం, (జనంసాక్షి) :** మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడేందుకు కొత్త టీమ్ సిద్ధమైంది. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) – ఎంజేపీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా జి. లివింగ్‌స్టన్ ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని సంఘం రాష్ట్ర ఆఫీసులో జరిగిన సమావేశంలో 15 మంది సభ్యులతో కూడిన కొత్త రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి, ప్రధాన కార్యదర్శి ఎ. వెంకట్, గురుకులాల విభాగం ఇన్‌ఛార్జ్ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. కొత్త అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన లివింగ్‌స్టన్‌తో పాటు కమిటీ సభ్యులకు పలువురు ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు. గురుకులాల్లో పనిచేస్తున్న టీచర్ల సమస్యల పరిష్కారం, ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం కొత్త కమిటీ గట్టిగా కృషి చేయాలని నాయకులు కోరారు. ఉపాధ్యాయులందరినీ ఏకం చేస్తూ సంఘాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. లివింగ్‌స్టన్ నాయకత్వంలో సంఘం మరింత చురుగ్గా ముందుకు సాగుతుందని నేతలు ధీమా వ్యక్తం చేశారు.



## పండితాపురంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు నారమ్మ మృతి

**పూలమాలలు వేసి నివాళులర్పించిన నాయకులు**



**కామేపల్లి, అక్టోబర్ 25(జనం సాక్షి):** పండితాపురం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు దిండు నారమ్మ (80) వయోభారంతో మృతి చెందగా, ఆమె భౌతికకాయానికి పలువురు గ్రామ పెద్దలు, నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నారమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని తెలిపారు, శోకసంద్రంలో ఉన్న వారి కుటుంబ సభ్యులకు గాఢ సానుభూతిని తెలియజేశారు అలాగే ఏ కష్టం వచ్చినా ఆ కుటుంబానికి ఎల్లప్పుడూ అండదండలుగా ఉంటామని మనోధైర్యాన్ని నింపారు. ఈ శ్రద్ధాంజలి కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎలమద్ది అప్పారావు,జిల్లా బిఆర్ఎస్ పార్టీ నాయకులు మూడు కృష్ణ ప్రసాద్,మండల నాయకులు ఆదూరి ప్రసాద్, ధర్మసోత్ కిసాన్, పసుమర్తి సత్యాలు, ధరావత్ నాగేశ్వరావులతో పాటు పలువురు స్థానికులు వచ్చి తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ కార్యకర్తలకు దిశ నిర్దేశం

- ఎమ్మెల్సీ ఇంచార్జ్ చాడ
- ముచ్చర్లలో సన్నాహక సమావేశం



**కామేపల్లి, అక్టోబర్ 25 (జనంసాక్షి):** రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకుని పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియను క్షేత్రస్థాయిలో వేగవంతం చేయడమే లక్ష్యంగా ముచ్చర్లలో మేధావులు కార్యకర్తలు పట్టభద్రుల తో బీఆర్ఎస్ శ్రేణులు సమాయత్తమయ్యాయి. ఆదివారం ముచ్చర్ల బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు తూము బాబు నివాసం వద్ద నిర్వహించిన సన్నాహక సమావేశం స్థానిక నాయకులు, కార్యకర్తల అభిమానులు ఉత్సాహపూరిత వాతావరణం నడుమ జరిగింది. ఈ కార్యక్రమానికి ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్సీ ఇంచార్జ్ చాడ కిషన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎమ్మెల్సీ సభ్యత్వ నమోదును ప్రణాళికాబద్ధంగా నిర్వహించి,పార్టీ బలాన్ని ప్రతి గ్రామంలోనూ నిరూపించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. సభ్యత్వ నమోదును ఎలా చేపట్టాలి, నమోదు ప్రక్రియలో ఎదురయ్యే సాంకేతిక అంశాలను ఏ విధంగా పరిష్కరించుకోవాలి అనే విషయాలపై నాయకులకు, శ్రేణులకు ఆయన స్పష్టమైన దిశా నిర్దేశం చేశారు. ప్రతి ఒక్క కార్యకర్త నిబద్ధతతో పనిచేసి నమోదు లక్ష్యాలను పూర్తి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో నాయకులు బానోత్ హరి సింగ్,మండల సమన్వయ కమిటీ సభ్యులు అంతోటి అచ్చయ్య, మూడు కృష్ణ ప్రసాద్,సామా మోహన్ రెడ్డి, మల్లెంపాటి శ్రీనివాసరావు, వడియాల కృష్ణారెడ్డి,కాట్రాల రాంబాబు, తూము శ్రీనులతో పాటు వివిధ గ్రామాల సర్పంచులు జాటోత్ లూసి, మాలోత్ కిషన్, ప్రసాద్,ఉప సర్పంచ్ గడ్డం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అదేవిధంగా పార్టీ ముఖ్య నాయకులు సతాకూటి హనుమంతరావు, ఆదూరి ప్రసాద్, చిప్పలపల్లి శ్రీనివాసరావు, రామకృష్ణ, కన్నమాల రాంబాబు, దుద్దుకూరి రాంబాబు తదితరులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఘనంగా 2002--2003 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం!

**పి.ఏ.పల్లి,అక్టోబర్ 25 (జనంసాక్షి):** గుడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002--2003 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఎన్నో ఏళ్ల తర్వాత ఒకచోట చేరిన పూర్వ విద్యార్థులు తమ పాఠశాల రోజులను గుర్తుచేసుకుంటూ,అప్పటి మధుర జ్ఞాపకాలనునెమరువేసుకున్నారు.ఒకరినొకర ం ఆప్యాయంగా పలకరించుకుంటూ,తమ జీవితాల్లో చోటుచేసుకున్న విశేషాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పి, ఉన్నత స్థాయికి ఎదిగేందుకు మార్గదర్శకత్వం వహించిన ఉపాధ్యాయులను విద్యార్థులు ఆత్మీయంగా సత్కరించారు.ఉపాధ్యాయులు సైతం తమ పూర్వ విద్యార్థులను కలుసుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.విద్యార్థి దశలో చేసిన అల్లరి,స్నేహాలు,తరగతి గది అనుభవాలు, పాఠశాలలో గడిపిన మధుర క్షణాలను గుర్తుచేసుకుంటూ సందడి చేశారు. కాలం మారినా,జీవితాల్లో ఎన్నో మార్పులు వచ్చినా పాఠశాల నాటి స్నేహాలు,గురువులతో ఉన్న అనుబంధం ఎప్పటికీ చెరిగిపోదని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు.ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలు పాత స్నేహాలను మరింత బలోపేతం చేయడంతో పాటు,భావితరాలకు స్ఫూర్తినిస్తాయని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో నల్గొండ ఎంఈఓ అరుంధతి దేవరకొండ ఎంఈఓ మాతృనాయక్ గుడిపల్లి మండల విద్యాధికారి శ్రీనయ్య ,పూర్వపు విద్యార్థులు అంజి బాబు,అనసూయ,శంకర్,బాలయ్య,బిఎస్ఎన్ చారి,పి.గిరి,సుఖేందర్, జెకేరా బేగం తదితరులు పాల్గొన్నారు.



# సూర్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు

తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మినీ ఛాయాసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. అనంతరం యజ్ఞశాలలో మహాసౌరహోమాన్ని నిర్వహించారు. అలాగే క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి, స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి అన్నప్రసాద వితరణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకులు కాకులారపు రజితజనార్ధన్‌స్వామి, గణపురం నరేష్ , గిరి, అర్చకులు భీమ్ పాండే , అంకిత్‌పాండే తదితరులు పాల్గొన్నారు.



# 34 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ




**సూర్యాపేట (జనంసాక్షి):** సీఎం సహాయ నిధి పేదలకు పెన్నిదని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్, వ్యవసాయ,రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది అన్నారు.ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 29లక్షల 90వేల రూపాయల 45 చెక్కులను లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు.వైద్యపరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సీఎం రిలీఫ్ ఫండ్ నిధులను అందిస్తున్నట్లు తెలిపారు.ఇప్పటి వరకు సూర్యాపేట నియోజకవర్గంలో తమ ద్వారా 484 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు వాటి విలువ 21505400 రూపాయలు, ఎల్ఓసీ 4810000 రూపాయలు, మొత్తంగా 2 కోట్ల 63 లక్షల 15 వేల రూపాయలను సహాయ నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు.వందలాది మంది పేద, మధ్య తరగతి ప్రజలకు సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక చేయూతనందించడం జరుగుతుందని తెలిపారు.సీఎం రేవంత్ రెడ్డికి, నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి, నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డికి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, సూర్యాపేట మండల పార్టీ అధ్యక్షుడు కోతి గోపాల్ రెడ్డి, చివ్వెంల మండల పార్టీ అధ్యక్షుడు ధారవత్ వీరన్న నాయక్, ఆత్మకూర్ (ఎస్) మండల పార్టీ అధ్యక్షుడు ముస్కు రామచంద్ర రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అర్వపల్లిలో శిథిలావస్థకు చేరిన దర్గా సత్రాలు.. ప్రమాదకరంగా మారిన వైనం

**జాజిరెడ్డిగూడెం, (జనంసాక్షి):** మతసామ్రాస్యానికి ప్రతీకగా నిలిచిన అర్వపల్లి శివారులోని హజ్రత్ ఖాజా నసీరుద్దీన్‌బాబా దర్గా వద్ద గతంలో దాతల సహకారంతో భక్తుల కోసం నిర్మించిన సత్రాలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. ప్రస్తుతం ఇవి ఏ క్షణంలోనైనా కూలే దశలో ఉన్నాయి.దఅయినప్పటికీ, సుదూర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చే భక్తులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ఆ శిథిల గదుల్లోనే తలదాచుకుంటున్నారు. దర్గా వద్ద కొత్త సత్రాలు నిర్మించాలని భక్తులు, స్థానికులు ఎంతోకాలంగా వక్ఫ్ బోర్డు అధికారులకు విన్నవిస్తున్నా ఎలాంటి స్పందన లేదు. శిథిలావస్థకు చేరిన ఈ రేకుల సత్రం ఎప్పుడూ కూలిపోయే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికైనా వక్ఫ్ బోర్డు అధికారులు స్పందించి, తక్షణమే నిధులు మంజూరు చేయాలని... ప్రమాదకరంగా మారిన పాత సత్రాలను తొలగించి కొత్త సత్రాలను నిర్మించాలని భక్తులు కోరుతున్నారు.






# పీఆర్సీని వెంటనే అమలు చేయాలి

**నేరేడుచర్ల అక్టోబర్ 25 ( జనంసాక్షి) :** పెండింగ్ లో ఉన్న పే రివిజన్ కమిషన్ ను వెంటనే అమలు చేయాలని టీఎస్ యూటీఎఫ్ సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ అనిల్ కుమార్ డిమాండ్ చేశారు.నేరేడుచర్లలో జరిగిన తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నేరేడుచర్ల, గరిడేపల్లి, పాలకీడు మండల మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,2024 తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 15 రోజుల్లో పెండింగ్ డీఏలన్నీ ఇస్తామని,పీఆర్సీ అమలు చేస్తామని ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు అనేక హామీలు ఇచ్చిందని,అధికారంలోకి వచ్చిన తర్వాత నేటి వరకు హామీలు నెరవేరలేదని విమర్శించారు.ప్రభుత్వం వెంటనే పే రివిజన్ కమిషన్ నివేదిక తెప్పించుకుని తెలంగాణ రాష్ట్రంలోని ఉద్యోగులు,ఉపాధ్యాయులు, పెన్షనర్లకు పీఆర్సీ అమలు చేయాలని, పెండింగ్ లో ఉన్న మిగిలిన నాలుగు కరువు భత్యం బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని,కొత్త బడులు ఏర్పాటు చేసే బదులు ఉన్న పాఠశాలలను అభివృద్ధి చేయాలని, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించేందుకు మధ్యాహ్న భోజన రేట్లు పెంచాలని,పాఠశాలల్లో నాన్ టీచింగ్ స్టాఫ్ ను నియమించాలని, ప్రభుత్వ బడుల పట్ల ప్రజల్లో విశ్వాసం కలిగించేలా ప్రభుత్వం నిర్దిష్టమైన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కె. బాలసైదిరెడ్డి, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎన్.సాంబయ్య,నేరేడుచర్ల మండల కమిటీ అధ్యక్షులు ఆర్. శ్రీనయ్య, మండల ప్రధాన కార్యదర్శి బి. అక్కయ్య బాబు,గరిడేపల్లి మండల అధ్యక్షులు బి.నాగేశ్వరరావు, పాలకీడు మండల అధ్యక్షులు పి.వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు, ఎల్ శ్రీనివాసరావు,ఎన్. రసింహారావు,నేరేడుచర్ల మండల ఎఫ్ డబ్ల్యూఎఫ్ కన్వీనర్ ఎన్. వెంకటేశ్వర్లు,కె.వెంకటేశ్వరరావు,బి. వెంకట నరసయ్య,గరిడేపల్లి మండల ఎఫ్ డబ్ల్యూఎఫ్ కన్వీనర్ ఆర్. రవీందర్ రెడ్డి, వై.రామానుజం, ఎండి. మజీదా బేగం, డి.సైదమ్మ,టి. రాఘవరెడ్డి,బి. జైహింద్, ఎల్.వి. శేఖర్, బి. మహేష్, వి.రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అమరేందర్.. విమర్శలకు ముందు
# వాస్తవాలు తెలుసుకో!

- మారెళ్ళ పాడు ఎత్తిపోతల పథకంపై ఆరోపణలు మానుకోవాలి..
- రైతులకు సాగునీరు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: ఓరుగంటి రమేష్ బాబు

**అశ్వాపురం, అక్టోబర్ 25 (జనంసాక్షి):** మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుపై విమర్శలు చేసే ముందు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ వాస్తవాలు తెలుసుకోవాలని అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు హితవు పలికారు. సీతారామ ప్రాజెక్టు, మారెళ్లపాడు ఎత్తిపోతల పథకంపై అవగాహన లేకుండా ఆరోపణలు చేయడం సరికాదన్నారు. రైతుల సాగునీటి సమస్యను రాజకీయాలకు వాడుకోవడం మానుకోవాలని సూచించారు.



### రైతులకు మేలు చేసే పనులపై రాజకీయాలెందుకు?

అశ్వాపురం మండల రైతులకు సాగునీరు అందించేందుకు మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ద్వారా తుమ్మలచెరువు ఆయకట్టుకు నీటిని అందించే చర్యలు చేపడుతున్నట్లు రమేష్ బాబు తెలిపారు. ఈ పథకం ద్వారా తుమ్మలచెరువు ఆయకట్టు పరిధిలో సుమారు 2,500 ఎకరాలతో పాటు గొల్లగూడెం ప్రాంతంలోని మరో 500 ఎకరాలకు సాగునీటి సదుపాయం కల్పించే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. మొత్తంగా సుమారు 7,000 ఎకరాలకు నీటి ప్రయోజనం చేకూర్చే లక్ష్యంతో కృషి చేస్తున్నట్లు వివరించారు. రైతులకు ప్రయోజనం కలిగించే పనులను రాజకీయ విమర్శలతో తక్కువ చేసి చూపడం తగదన్నారు.

### నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు

రాబోయే రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద తాత్కాలిక ఇసుక బస్తాల ఏర్పాటు పనులు చేపట్టడం, అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించేందుకు చర్యలు తీసుకోవడం ప్రభుత్వ ముందుచూపుకు నిదర్శనమని రమేష్ బాబు పేర్కొన్నారు. సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కావాలంటే నీటి లభ్యత, సాంకేతిక అంశాలు, ఆయకట్టు అవసరాలను పరిగణనలోకి తీసుకుని ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. ఆధారాలు లేకుండా నీటిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారంటూ ఆరోపణలు చేసి రైతుల్లో అపోహలు సృష్టించడం సరికాదని విమర్శించారు.

### గతంలో ఏం చేశారు.. ఇప్పుడు ఏం చేస్తున్నారు?

గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు అశ్వాపురం రైతుల సాగునీటి సమస్యకు ఎలాంటి శాశ్వత పరిష్కారం చూపారో ప్రజలకు వివరించాలని రమేష్ బాబు ప్రశ్నించారు. మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ద్వారా రైతులకు ప్రయోజనం చేకూర్చే ప్రయత్నాలను స్వాగతించకుండా విమర్శలకే పరిమితం కావడం వెనుక ఉద్దేశమేమిటని నిలదీశారు. సాగునీటి పంపిణీపై నిజంగా ఆందోళన ఉంటే ఆధారాలతో ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని, సమస్యల పరిష్కారానికి నిర్మాణాత్మకంగా వ్యవహరించాలని సూచించారు.

### ఎమ్మెల్యే పాయం కృషిని గుర్తించాలి

స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు రైతుల ప్రయోజనాల కోసం చేపడుతున్న కార్యక్రమాలను పక్కనపెట్టి విమర్శలు చేయడం వల్ల సమస్యలు పరిష్కారం కావని రమేష్ బాబు అన్నారు. ప్రజాప్రతినిధులను ప్రశ్నించే హక్కు ప్రతిపక్షాలకు ఉన్నప్పటికీ, అభివృద్ధి పనులపై వాస్తవాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన బాధ్యత కూడా ఉందన్నారు.రైతులకు కావాల్సింది రాజకీయ విమర్శలు కాదు.. సాగునీరు, ఆరోపణలు కాదు.. పరిష్కారాలు. అశ్వాపురం రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు చేస్తున్న ప్రయత్నాలకు సహకరించాలని బీఆర్ఎస్ నాయకులకు రమేష్ బాబు సూచించారు.

# నవంబర్ 1న ఢిల్లీలో జరిగే ఓటు బచావో దేశ్ బచావో సభను విజయవంతం చేయాలి

**సూర్యాపేట (జనంసాక్షి):** జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం సూర్యాపేట డీసీసీ అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య అధ్యక్షతన జరిగిన ఓట్ బచావో దేశ్ బచావో కార్యక్రమంలో భాగంగా విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఏఐసీసీ పరిశీలకులు రాంభూపాల్ రెడ్డి, ఉమ్మడి నల్లగొండ ఖమ్మం వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ గుంజ రేణుక, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్, వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది ఓటు విలువ, ప్రజాస్వామ్య పరిరక్షణ, దేశంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులపై మాట్లాడారు.ఏఐసీసీ పరిశీలకులు రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించాలనే లక్ష్యంతో దేశవ్యాప్తంగా ఓటు బచావో దేశ్ బచావో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఇందులో భాగంగా నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో ఇండియా కూటమి పార్టీలతో కలిసి భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఈ సభను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఎన్నికల వ్యవస్థపై వ్యక్తమవుతున్న అనుమానాలపై వాస్తవాలను ప్రజల ముందుంచాలని కోరారు.ఓటు బచావో దేశ్ బచావో నినాదంతో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, కౌన్సిలర్ వెలుగు వెంకన్న, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోతి గోపాల్ రెడ్డి, ధారావత్ వీరన్న నాయక్, ముస్కు రాంచంద్రరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వేములపల్లి వాసుదేవరావు, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధ, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బాలకృష్ణ, ఎన్ఎస్ యుఐ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్,పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.




# నీటి కొరతకు సర్పంచ్ ఈడెం రాధా శ్రీనివాస్ చొరవ



**రామన్నపేట, అక్టోబర్ 26(జనంసాక్షి):** రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలో రాబోయే వేసవి కాలంలో ఎల్ నినో వల్ల ఏర్పడే మంచినీటి ఎద్దడి నివారణ కోసం ముందస్తు చర్యలలో భాగంగా గ్రామ సర్పంచ్ ఇడెం రాధా శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతన బోరు తవ్వకం చేపట్టారు.శివాలయం ప్రక్కన చేపట్టిన ఈ బోరు తవ్వకంలో శ్రీశ్రీశ్రీ శంభు లింగేశ్వర స్వామి దయ వల్ల మూడు ఇంచుల నీరు పడింది. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యురాలు జువ్వగొని మల్లమ్మ, వనం సత్తయ్య, తాటిపాముల శ్రీను, తాటిపాముల నరసింహ, బలికే లక్ష్మయ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లకు 23 కేంద్రాల ఏర్పాటు



**జాజిరెడ్డిగూడెం, (జనంసాక్షి):** ఈ వానాకాలం సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలుకు మండలంలో ఈసారి 23 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. సెర్ప్ ఆధ్వర్యంలో 11, పీసీఎస్ ఆధ్వర్యంలో 4, ఎండీసీఎంఎస్ ఆధ్వర్యంలో 7, మ్యాక్స్ ఆధ్వర్యంలో ఒకటి చొప్పున ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా ధాన్యం వరికోతలు మొదలయ్యాయని, వచ్చే నెలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతాయని అధికారులు చెబుతున్నారు.

# నేడు మండల అభివృద్ధిపై ప్రత్యేక సమీక్షా సమావేశం

**నూతనకల్ అక్టోబర్ 25 ( జనంసాక్షి):** నూతనకల్ మండలంలో మండల పరిషత్ కార్యాలయం నందు మండల,గ్రామ పంచాయతీల కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సునీత తెలిపారు.మండల ప్రత్యేక అధికారి ఎంఏ భారతి అధ్యక్షతన సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం ప్రారంభం కానుండగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ హాజరుకానున్నట్లు వారు తెలిపారు. అందరూ సర్పంచులు,అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు తమ శాఖల నివేదికలతో ముందస్తుగా హాజరుకావాలని ఎంపీడీవో సునీత తెలిపారు.



# మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**సూర్యాపేట (జనంసాక్షి):**మున్సిపల్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నేడు హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వల్లపుదాస్ సాయికుమార్ పిలుపునిచ్చారు.ఆదివారం జిల్లా కేంద్రంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు.మున్సిపల్ కార్మికులు పట్టణాల పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణతో పాటు ప్రజలకు అవసరమైన అనేక సేవలను అందిస్తూ నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు.ఎండ, వానలను లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్న కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు.కార్మికుల శ్రమకు తగిన వేతనాలు, ఉద్యోగ భద్రత, ఇతర హక్కులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.మున్సిపల్ కార్మికులకు తక్షణమే పీఆర్సీ ప్రకటించాలని, కార్మికులందరికీ డీఏ వర్తింపజేయాలని, కనీస వేతనాన్ని నెలకు రూ.30 వేలుగా నిర్ణయించి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.పట్టణాల విస్తరణకు అనుగుణంగా మున్సిపల్ సిబ్బంది సంఖ్యను పెంచాలని, పెరుగుతున్న పని భారానికి అనుగుణంగా అదనపు సిబ్బందిని నియమించాలని కోరారు. హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద జరిగే ధర్నాలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు చాగంటి వెంకటరమణ, జెల్లీ కృష్ణ, వెంకటమ్మ, నాగమ్మ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.





# ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

## 36ఏళ్ల తర్వాత కలుసుకున్న గుంపుల తిరుమలగిరి జడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు

**సూర్యాపేట (జనంసాక్షి):** చివ్వెంల మండలం గుంపుల తిరుమలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989- 90 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని జీవీవీ ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నాటి విద్యార్థులు మాట్లాడుతూ పాఠశాలలోని తమ యొక్క నాటి స్మృతులు మరిచిపోలేని మధురానుభూతులని అన్నారు.36 ఏళ్ల తర్వాత నాటి విద్యార్థులంతా ఒకచోట కలుసుకొని జ్ఞాపకాలను పంచుకోవడం ఆనందంగా ఉందన్నారు.తాము చదువుకున్న రోజులను, స్నేహితులతో గడిపిన మధుర క్షణాలను గుర్తుచేసుకున్నారు.తమకు విద్యాబుద్ధులు నేర్పి నేడు ఉన్నత స్థాయిలో ఉండేలా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.అంతకు ముందు తమ నుండి దూరమైన ఉపాధ్యాయులకు,తోటి విద్యార్థులకు ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం నాటి ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులందరూ వివిధ రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదిగి గుర్తింపు తెచ్చుకోవడం ఆనందంగా ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారాయణ, వెంకటేశ్వర రావు, సావిత్రి, విద్యార్థులు బి.వెంకటేశ్వర్లు, ఎం.వెంకన్న, డి.నాగేష్, ఎం.రాము, వై.వెంకటరెడ్డి, కోటేశ్వరరావు, లింగయ్య, శ్రీనివాస్, బాలాజీ, పిచ్చయ్య, శేఖర్, కవిత, పిచ్చమ్మ, రాజకుమారి, సత్యవతి, లక్ష్మీ, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్ స్థలాన్ని చదును చేయడం అభినందనీయం

- వారాహి ఆగ్రో ఇండస్ట్రీస్ యాజమాన్యానికి ఘన సన్మానం
- రైతులకు మార్కెట్ సౌకర్యం కల్పించడమే లక్ష్యం
- గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం

**రామన్నపేట, అక్టోబర్ 25 (జనంసాక్షి):** మండలంలోని మునిపంపుల గ్రామంలో రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య అయిన ధాన్యం కొనుగోలు కేంద్రం స్థలాన్ని చదును చేసి, రైతులకు మార్కెట్ సౌకర్యం అందుబాటులోకి తీసుకురావడానికి గత 12 రోజులుగా యంత్రాలతో పనులు చేపట్టి సహకరించిన వారాహి ఆగ్రో ఇండస్ట్రీస్ యాజమాన్యానికి గ్రామ పంచాయతీ పాలకవర్గం, మార్కెట్ అభివృద్ధి కమిటి ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం మాట్లాడుతూ ఐకేపీ కేంద్రం స్థలం చదునుగా లేకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతులకు మార్కెట్ సౌకర్యాలు మెరుగుపరచాలనే లక్ష్యంతో వారాహి ఆగ్రో ఇండస్ట్రీస్ యాజమాన్యం ముందుకు వచ్చి గత 12 రోజులుగా యంత్రాల సహాయంతో స్థలాన్ని చదును చేయించడం అభినందనీయమన్నారు.

రైతుల ప్రయోజనాల కోసం సహకరించిన వారందరికీ గ్రామ ప్రజలు, రైతుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ తాళ్ల క్రాంతి కుమార్, మార్కెట్ అభివృద్ధి కమిటీ గౌరవ సభ్యులు మామిడి పద్మారెడ్డి, కట్ట యాదయ్య, తాళ్లపల్లి జితేందర్, మామిండ్ల అశోక్, తాళ్లపల్లి దుర్గయ్య, మామిడి పాండురెడ్డి, తొలుపునూరి చంద్రశేఖర్, ఏలూరి రవి,ఎండీ నజీరొద్దీన్, భాషపాక యాదయ్య, వార్డు సభ్యులు యాదాసు లక్ష్మణ్, మేకల రాములు, వారాహి ఆగ్రో ఇండస్ట్రీస్ యాజమాన్య ప్రతినిధులు నంబూరి కిరణ్, చంద్రన్న, తరుణ్ , మార్కెట్ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# గురజాల సైదుల కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన మన్నెం రంజిత్

**హాలియా, జనం సాక్షి అక్టోబర్ 25:** అనుముల మండలం చల్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన గురజాల సైదులు ఇటీవల మరణించిన నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర నాయకులు మన్నెం రంజిత్ యాదవ్ ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సైదులు చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం తనవంతుగా ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

ఈ కార్యక్రమంలో చెగొండి కృష్ణ, ఉప సర్పంచ్ గురజాల మారయ్య, వార్డు సభ్యుడు ఇరిగి ప్రభాకర్, మన్నెం రంజిత్ యువసేన అధ్యక్షుడు కుంటిగొర్ల రాజశేఖర్, చింతచర్ల మహేష్, గాలిమెట్టి గోవర్ధన్, నామ రాంబాబు, పగిడిమర్రి ప్రశాంత్, కొమ్ము కొండల్, గురజాల వంశీ, పోలె కోటేష్, గురజాల సాగర్, గురజాల మహేష్, గురజాల నరేష్, దుబ్బ వినోద్‌తో పాటు గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.





# ఓటర్ల నమోదుకు కృషిచేయాలి

**జాజిరెడ్డిగూడెం,అక్టోబర్ 25 (జనంసాక్షి):** అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకునేలా నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్, జిల్లా నాయకుడు మొరిశెట్టి ఉపేందర్ కోరారు.



జాజిరెడ్డిగూడెంలో ఆదివారం పట్టభద్రుల ఓటర్ల నమోదులో భాగంగా దరఖాస్తులను స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపుకై ప్రతి ఒక్కరూ పట్టుదలతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షుడు వల్లపు గంగయ్య, బొడ్డు రామలింగయ్య, తాడూరి రామకోటి, సురేష్, వెంకన్న, హరిప్రసాద్, సోమిరెడ్డి, మల్లయ్య, నాగరాజు, శ్రీనివాస్, వెంకన్న, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు

# పట్టభద్రులైన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలి

**నూతనకల్, అక్టోబర్ 25 (జనంసాక్షి):** పట్టభద్రులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకొని నల్లగొండ ఖమ్మం వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి కి పట్టబద్రులు మద్దతు తెలపాలని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బంటు బద్రి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విద్యావంతుడైన సర్వోత్తమ్ రెడ్డి ని గెలిపించినట్లయితే నిరుద్యోగుల పట్ల పోరాటం చేసి వారి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తాడని తెలిపారు ఈ కార్యక్రమంలో గుండ గాని సైదులు కోల నరేష్ బంటు శ్రీను శివ ఇటికాల సైదులు కుశలవ వెంకటయ్య రాజు శీను రవి సైదులు తదితరులు పాల్గొన్నారు.



# మునుగోడు అభివృద్ధికి ఈఎల్వీ భాస్కర్ మాస్టర్ ప్లాన్

- ప్రతి మండలంలో ఐదెకరాల్లో స్పోర్ట్స్ గ్రౌండ్..
- నియోజకవర్గంలో కోటి మొక్కల లక్ష్యం
- తాగునీటి ఎద్దడికి పరిష్కారం.. శివన్నగూడెం చెరువుకు నీరు
- రాచకొండ దసరాకు అధికారిక గుర్తింపు కోసం కృషి



**మర్రిగూడ, అక్టోబర్ 25 (జనం సాక్షి)**

మునుగోడు నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, యువతకు అవకాశాల కల్పన, పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా ఈఎల్వీ భాస్కర్ పలు కీలక ప్రణాళికలను వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా సామాజిక సేవకు ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతానని స్పష్టం చేశారు. ప్రతి మండలంలో ఐదెకరాల విస్తీర్ణంలో క్రీడా మైదానాల ఏర్పాటు, నియోజకవర్గవ్యాప్తంగా కోటి మొక్కలు నాటడం, గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు బోర్లు వేయించడం, శివన్నగూడెం చెరువుకు నీరు అందేలా కృషి చేయడం, రాచకొండ దసరా ఉత్సవాలకు అధికారిక గుర్తింపు సాధించడం వంటి లక్ష్యాలను ప్రకటించారు. మరోవైపు ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని కూడా విస్తృతంగా చేపట్టాలని నిర్ణయించారు. మునుగోడు దసరా ఉత్సవ కమిటీ సభ్యులతో నిర్వహించిన ఆత్మీయ చిట్‌చాట్‌లో ఈ అంశాలపై తన ఆలోచనలను పంచుకున్నారు.

**ప్రతి మండలంలో ఐదెకరాల క్రీడా మైదానం**

గ్రామీణ యువతలో అపారమైన క్రీడా ప్రతిభ ఉన్నప్పటికీ, సరైన మైదానాలు, మౌలిక వసతులు లేక అనేకమంది అవకాశాలను అందిపుచ్చుకోలేకపోతున్నారని ఈఎల్వీ భాస్కర్ పేర్కొన్నారు. యువత క్రీడల్లో రాణించేందుకు అవసరమైన వసతులు కల్పించాలనే లక్ష్యంతో మునుగోడు నియోజకవర్గంలోని ప్రతి మండలంలో ఐదెకరాల విస్తీర్ణంలో స్పోర్ట్స్ గ్రౌండ్ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామీణ క్రీడాకారులకు మెరుగైన అవకాశాలు లభించేలా క్రీడా మైదానాల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

**తాగునీటి ఎద్దడి ఎదురైతే బోర్లు**

గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని భాస్కర్ పేర్కొన్నారు. వాతావరణ మార్పులు, వర్షపాతంలో హెచ్చుతగ్గుల నేపథ్యంలో నీటి సంరక్షణపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని సూచించారు. ఏ గ్రామంలోనైనా తాగునీటి ఎద్దడి ఏర్పడితే పరిస్థితులను బట్టి బోర్లు వేయించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నీటిని పొదుపుగా వినియోగించుకోవడంతో పాటు అందుబాటులో ఉన్న నీటి వనరులను సంరక్షించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

**రాజకీయాలకు అతీతంగా సామాజిక సేవే లక్ష్యం**

పార్టీలకు అతీతంగా ప్రజల అవసరాలను గుర్తించి సేవ చేయడమే తన లక్ష్యమని ఈఎల్వీ భాస్కర్ స్పష్టం చేశారు. పేదలకు అండగా నిలవడం, గ్రామాల అభివృద్ధికి సహకరించడం, ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేయడం తన ఆశయమని పేర్కొన్నారు. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు అందరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

**రాచకొండ దసరాకు అధికారిక గుర్తింపు కోసం కృషి**

రాచకొండ దసరా ఉత్సవాలకు అధికారిక గుర్తింపు తీసుకొచ్చే దిశగా కృషి చేస్తానని భాస్కర్ వెల్లడించారు. ప్రాంతీయ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక వారసత్వాన్ని భావితరాలకు అందించేందుకు ఉత్సవాలకు తగిన ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాచకొండ దసరా ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన గుర్తింపు, సహకారం సాధించేలా ప్రయత్నిస్తానని తెలిపారు.

**శివన్నగూడెం చెరువుకు నీరు.. రైతులకు ప్రయోజనం**

శివన్నగూడెం చెరువుకు నీరు చేరేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఈఎల్వీ భాస్కర్ ప్రస్తావించారు. చెరువుల్లో నీటి నిల్వలు పెరిగితే భూగర్భ జలాల అభివృద్ధికి, వ్యవసాయానికి, పశుపోషణకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు సంబంధిత శాఖలు, అధికారులతో సమన్వయం అవసరమని అభిప్రాయపడ్డారు.



**కోటి మొక్కలతో పచ్చదనం పెంపునకు బృహత్తర లక్ష్యం**

మునుగోడు నియోజకవర్గవ్యాప్తంగా కోటి మొక్కలు నాటాలనే లక్ష్యాన్ని ఈఎల్వీ భాస్కర్ ప్రకటించారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో, వాటిని సంరక్షించడం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యువత, గ్రామస్థులు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములై పచ్చదనం పెంపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి**

మరోవైపు ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని నవంబర్ 6వ తేదీలోగా విస్తృతంగా నిర్వహించాలని ఈఎల్వీ భాస్కర్ మండల ఇన్‌చార్జిలను కోరారు. ఈఎల్వీ భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి మండల కేంద్రంలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి, అర్హులైన ఓటర్లు పెద్ద సంఖ్యలో నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాలవారీగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఓటరు నమోదుకు అవసరమైన సమాచారం అందించాలని కోరారు. మండల ఇన్‌చార్జిలు సమన్వయంతో పనిచేస్తూ, నిర్ణీత గడువులోగా నమోదు ప్రక్రియ పూర్తయ్యేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించేందుకు నమోదు ప్రక్రియపై విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు.

## పల్లివాడ ఘటనపై రాజకీయం..

# చిరుమర్తి తీరుపై కాంగ్రెస్ నేతల ఫైర్

**పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నాపై మాజీ సర్పంచ్‌ల ఫోరం నేత గంగుల రాజిరెడ్డి విమర్శలు**

**రామన్నపేట, అక్టోబర్ 25 (జనంసాక్షి) :** మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నాకు దిగడం విడ్డూరంగా ఉందని మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గంగుల వెంకట్ రాజిరెడ్డి విమర్శించారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని సుభాష్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ.. పల్లివాడలో మహిళపై దాడి ఘటనను రాజకీయాలకు ఉపయోగించుకోవడం సరికాదన్నారు. రాజకీయ కక్షసాధింపు చర్యలను తాము వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం లక్ష్యమని పేర్కొన్నారు.

**మహిళపై దాడి హేయమైన చర్య**

రామన్నపేట మండలం పల్లివాడలో దుర్గామాత నిమజ్జనం సందర్భంగా మద్యం మత్తులో మహిళపై బీరు సీసాతో దాడి చేయడం హేయమైన చర్య అని నాయకులు పేర్కొన్నారు. వైన్స్ షాపు ఎదుట దుర్భాషలాడుతూ దాడికి పాల్పడిన ఘటనపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనపై చిరుమర్తి లింగయ్య తన అనుచరులతో పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేయడాన్ని గంగుల రాజిరెడ్డి తప్పుబట్టారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేయడం సరికాదని విమర్శించారు.

**పోలీసుల విధులకు ఆటంకం కలిగించొద్దు**

మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య గతంలోనూ



మండలంలో చిల్లర రాజకీయాలకు పాల్పడ్డారని పున్న జగన్మోహన్, తిమ్మాపురం మహేందర్ రెడ్డి విమర్శించారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై ఒత్తిడి తీసుకురావడం, బెదిరింపులకు పాల్పడటం సరికాదన్నారు. మహిళపై దాడి ఘటనతో గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిందని, ఇలాంటి ఘటనలను రాజకీయాలకు అతీతంగా ఖండించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పున్న జగన్మోహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ నంద్యాల బిక్షం రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి తిమ్మాపురం మహేందర్ రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు కందిమల్ల గోపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండి జమీరుద్దీన్, సీనియర్ నాయకులు బత్తుల కృష్ణ, సాల్వేర్ అశోక్, వనం చంద్రశేఖర్, జెల్ల వెంకటేష్, పిట్ట వెంకట్ రెడ్డి, బొడ్డు సురేందర్రావు, శంబాల వెంకటేష్, కోట సుధాకర్, యదాస్ యాదయ్య, నోముల ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు రాజ్యాంగంపై అవగాహన అవసరం

**నల్లగొండ ప్రతినిధి,అక్టోబర్ 25,(జనం సాక్షి):** తెలంగాణ రాష్ట్ర ఎస్ఐ, కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు భారత రాజ్యాంగంపై అవగాహన కల్పించేందుకు నల్గొండ పట్టణంలోని షేర్ బంగ్లా పాతబస్తీ ఆర్య సమాజ్ మందిరంలో జై జవాన్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మాజీ సైనికుడు కొండోజు సత్యనారాయణ ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా, ప్రముఖ న్యాయవాది డాక్టర్ వెంకట రమణ రెడ్డి విద్యార్థులకు భారత రాజ్యాంగంలోని కీలక అంశాలు, రాజ్యాంగ విలువలు, పౌరుల హక్కులు, విధులు, ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగం ప్రాధాన్యతను వివరించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు రాజ్యాంగంపై సమగ్ర అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సదస్సులో సుమారు 40 మంది విద్యార్థులు పాల్గొని రాజ్యాంగానికి సంబంధించిన పలు అంశాలపై అవగాహన పొందారు. పోలీసు ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న యువతకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 28వ వార్డు కార్పొరేటర్ పుష్పాంజలి వెంకన్న, 27వ వార్డు కార్పొరేటర్ సటు రేవతి, కాశిరెడ్డి, బులుగూరి యాదగిరి, రాందాస్ వాసు, ప్రియాంక, మేఘన, సీనియర్ జర్నలిస్ట్ ఎలగందుల సురేష్, డాక్టర్ జి. శ్రీకాంత్, గంట రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల్లో రాజ్యాంగంపై అవగాహన పెంపొందించడంతో పాటు దేశ సేవ పట్ల బాధ్యతాయుతమైన దృక్పథాన్ని అలవర్చేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు.





# జూలూరులో బీజేపీ జెండా ఆవిష్కరణ



భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 25 (జనం సాక్షి): మండలంలోని జూలూరు గ్రామంలో ఆదివారం భారతీయ జనతా పార్టీ నూతన జెండాను ఆవిష్కరించారు. మండల అధ్యక్షుడు మేకల రవీందర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూర నర్సయ్య గౌడ్, భువనగిరి జిల్లా మాజీ అధ్యక్షుడు పాశం భాస్కర్, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలే చంద్రశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేకల చొక్కా రెడ్డి, చిక్క కృష్ణ, జిల్లా కౌన్సిల్ మెంబర్ పల్లెకాడి బసవయ్య, రంగారెడ్డి, చెరుకు వెంకటేష్, పశులాది రామచందర్ రావు, కేసారం కృష్ణారెడ్డి, బైరు వెంకటేష్, మానస మణికంఠ, అలివేలు, ఎన్నెం శివ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వృద్ధ దంపతులకు గాయాలు

టేకులపల్లి, అక్టోబర్ 25(జనంసాక్షి): బైక్ పై వెళుతున్న వృద్ధ దంపతులకు ఆవు దూడలు తగిలి రోడ్డుపై పడిపోవడంతో ఇరువురికి గాయాలైన సంఘటన ఆదివారం టేకులపల్లి మండల కేంద్రంలో జరిగింది. స్థానికులు వెంటనే108 వాహనానికి సమాచారం అందించడంతో వెంటనే వాహనం చేరుకొని ప్రథమ చికిత్స అందిస్తూ కొత్తగూడెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇల్లందు, కొత్తగూడెం ప్రధాన రహదారిలోని టేకులపల్లి మండల కేంద్రంలో శ్రీ కోదండ రామాలయం సమీపాన జరిగింది. టేకులపల్లికి చెందిన వృద్ధ దంపతులైన నాగేశ్వరరావు, సీతమ్మ బైక్ మీద ఇంటికి వెళుతున్న క్రమంలో ఒక్కసారిగా రామాలయం సమీపాన రోడ్డుపైకి మూడు ఆవు దూడలు రావడంతో వారి బైకు తగిలి రోడ్డుపై అదుపుతప్పి పడిపోయారు. నాగేశ్వరరావుకు నడుముకు బలమైన దెబ్బ తగలగా, సీతమ్మకు తలకు, ముఖానికి గాయాలయ్యాయి. వారిరువురు కొత్తగూడెం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు.



# రాజుపేట కాలనీలో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్

## తనిఖీల్లో 58 వాహనాలు స్వాధీనం.. 150 కేసులు నమోదు

### ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : డీఎస్పీ అరుణ్‌కుమార్

భద్రాచలం, అక్టోబర్ 25 (జనంసాక్షి) భద్రాచలంలోని రాజుపేట కాలనీలో ఆదివారం తెల్లవారుజామున పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు డీఎస్పీ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని 42 ద్విచక్ర వాహనాలు, 8 ఆటోలతో పాటు నంబర్ ప్లేట్లు లేని మరో 8 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి 150 కేసులు నమోదు చేసి రూ.36,390 జరిమానా విధించారు. కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమంలో భాగంగా కాలనీవాసులతో మాట్లాడిన డీఎస్పీ అరుణ్‌కుమార్ గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, విక్రయం, అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు, యూపీఐ పిన్‌లను ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐ రాజు, వెంకటప్పయ్య, పోలీసు అధికారులు, సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది, డాగ్ స్క్వాడ్ బృందం తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా బిసిఆర్ ట్రస్ట్ వైద్య సేవలు

## ప్రతి నెలా ఉచిత కంటి పరీక్షలు.. తక్కువ ధరకే బీపీ, షుగర్ మందులు

## మూడవ నెల వైద్య శిబిరాన్ని ప్రారంభించిన చల్లగుళ్ల నాగేశ్వరరావు




భద్రాచలం అక్టోబరు 25 (జనంసాక్షి) పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య సేవలను చేరువ చేయాలనే లక్ష్యంతో బండారు చంద్రరావు (బి.సి.ఆర్.) ట్రస్ట్ నిర్వహిస్తున్న వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లగుళ్ల నాగేశ్వరరావు అన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మూడవ నెల వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శరత్ మ్యాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో వైద్య పరీక్షలు చేయించుకోలేని పేదలకు ఇటువంటి శిబిరాలు ఎంతో అండగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు స్వచ్ఛంద సంస్థలు చేపట్టే సేవా కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు.

**ప్రజారోగ్యమే లక్ష్యంగా ట్రస్ట్ సేవలు**

సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి మాట్లాడుతూ వైద్య ఖర్చులు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో సామాన్యులకు అందుబాటులో వైద్య పరీక్షలు, మందులు అందించడం అవసరమన్నారు. బి.సి.ఆర్. ట్రస్ట్ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ ప్రతి నెలా వైద్య శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. మధుమేహం, రక్తపోటు సమస్యలతో బాధపడేవారు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకుంటూ వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలని సూచించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా నిరంతర వైద్య సేవలు పొందలేని వారికి ట్రస్ట్ శిబిరాలు ప్రయోజనకరంగా ఉంటున్నాయని తెలిపారు. ఇందులో భాగంగా బీపీ, షుగర్ బాధితులకు నెలకు సరిపడా మందులను కేవలం రూ.100కే అందిస్తున్నట్లు వెల్లడించారు.

**శరత్ మ్యాక్సివిజన్ సౌజన్యంతో ఉచిత కంటి పరీక్షలు**

కంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన వైద్య సలహాలు పొందేందుకు ఉచిత కంటి పరీక్షల శిబిరం ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు. ముఖ్యంగా వయోవృద్ధులు, మధుమేహంతో బాధపడేవారు కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవడం ద్వారా సమస్యలను ముందుగానే గుర్తించి తగిన చికిత్స పొందవచ్చని పేర్కొన్నారు.




**ప్రతి నెల చివరి ఆదివారం వైద్య శిబిరం**

బి.సి.ఆర్. ట్రస్ట్ కన్వీనర్ బండారు శరత్ బాబు మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రతి నెల చివరి ఆదివారం వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాల వారు ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించడం కూడా ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. శిబిరాల నిర్వహణకు సహకరిస్తున్న వైద్య సిబ్బందికి, శరత్ మ్యాక్సివిజన్ కంటి ఆసుపత్రి నిర్వాహకులకు, సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలను చేపడతామని వెల్లడించారు.

**కందుకూరి శంకరాచారి, వరలక్ష్మి జ్ఞాపకార్థం అల్పాహారం పంపిణీ**

ఆదివారం జరిగిన వైద్య శిబిరంలో కందుకూరి శంకరాచారి, వరలక్ష్మి జ్ఞాపకార్థం ఎర్రంశెట్టి వెంకట రామారావు షుగర్ బాధితులకు అల్పాహారం అందించారు. పేదలకు వైద్య సేవలు అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజల సహకారంతో ఇటువంటి సేవా కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. ఈ శిబిరంలో వైద్యులు పవన్ కుమార్, నీరజారెడ్డి, తేజస్విని పాల్గొని వైద్య సేవలు అందించారు. మారుతి నర్సింగ్ సిబ్బందితో పాటు మెడికల్ ఆఫీసర్ వీరభద్రం, ఫార్మసిస్టులు మల్లికార్జునరావు, గడ్డం నరహరి సేవలందించారు. ట్రస్ట్ నిర్వాహకులు సున్నం గంగా, ఎర్రంశెట్టి వెంకట రామారావు, డి. సీతాలక్ష్మి, కొలగాని రమేష్, నాదెళ్ల లీలావతి, జీవనజ్యోతి, 20వ వార్డు సభ్యురాలు ఇర్ప అనసూయ, నాగరాజు, అజయ్ కుమార్, భూపేంద్ర, కనకశ్రీ, కోరాడ శ్రీనివాస్, గౌతమి, వై. పూర్ణిమ, నాగలక్ష్మి, రామరాజు, దుర్గ, అర్చన, రామకృష్ణ, కొరసా రవి తదితరులు పాల్గొన్నారు.